విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలో గీతాబాయి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. గీతాబాయి జిల్లా కార్యాలయం నుండి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ సందర్భంగా నాయుడుబడ్డీ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి డా. గీతాబాయి మాట్లాడారు. 1990 నుండి ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం చేస్తున్నారని, జనాభా పెరుగుదల, పర్యావరణం అభివృద్ధికి వాటి సంబంధాలు, సంబంధిత సమస్యలపై ప్రపంచ స్టేట్ హోల్డర్ల దృష్టిని కేంద్రీకరించడానికి చేసే ప్రయత్నంలో ఇది అన్నారు. ఆరోగ్య సంరక్షణను అందించడానికి జనాభా సమాచారాన్ని సేకరించుట, విశ్లేషించుట దానిని ఉపయోగించడంలో ప్రాముఖ్యతను వివరించారు. గర్భధారణ, ప్రసవ సమయంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన, కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం మరియు తలుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ర్యాలీ జిల్లా కార్యాలయం నుండి ప్రభుత్వ సాధారణ వైద్యశాల మచిలీపట్నం వరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ర్యాలీలో బి. శివ సాంబిరెడ్డి, హెచ్.ఈ.ఈ.ఓ.బి.రాజేంద్రకుమార్, హెచ్.ఈ. జిల్లా మలేరియా విభాగం సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భోదనా సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు ప్లే కార్డులు ధరించి ర్యాలీని విజయవంతం చేశారన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి : సీఐ దుర్గారావు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక కెబిఆర్ ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాలలో టూటౌన్ పోలీసు ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రత నిబంధనల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టూటౌన్ సి.ఐ దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనం నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి వుండాలని, ద్విచక్రవాహనం నడిపే వారు విధిగా హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ మోటారు వాహనాల చట్టాలను గౌర వించి, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎం.వి.ఐ స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ గౌరీమణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధే ప్రధాన లక్ష్యం

నీటి సమస్య లేకుండా చేస్తాం : ఎంపీ బాలశౌరి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లా అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. కలెక్టరేట్లోని సమావేశపు మందిరంలో గురువారం కలెక్టర్ డీకె. బాలాజీ ఆధ్వర్యంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి జిల్లాలోని పలు అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రధానంగా మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనుల పురోగతి, జల జీవన్ మిషన్ పథకం, ప్రకాశం బ్యారేజ్ దిగువన నిర్మించ తలపెట్టిన మరో రెండు బ్యారేజీల నిర్మాణం, ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం, సిఎస్ఆర్ ఎంపి లాడ్స్ నిధులు, మచిలీపట్నం అభివృద్ధి తదితర అంశాలపై విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని, ముఖ్యంగా తీరప్రాంతాలైన అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి మంచినీటిని అందించేందుకు అవసరమైన నిధులను సమకూరుస్తామని, అందుకు సంబంధించిన పనులను సమర్థవంతంగా నిర్వహించ గలిగే ఏజెన్సీకి పనులను అప్పజెప్పే విధంగా చూడాలని అన్నారు. మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న మచిలీపట్నం పోర్టు పనులు దాదాపుగా సంవత్సరం నుండి నిరాటంకంగా కొనసాగుతూ ప్రస్తుతం 20 శాతం మేర పనులు పూర్తయ్యాయని అధికారులతో తెలుసుకున్న ఆయన ప్రణాళిక ప్రకారం 16 బెర్తుల నిర్మాణానికి గాను మొదటి దశలో నాలుగు బెర్తులు నిర్మాణాన్ని నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని పోర్టు అధికారులకు సూచించారు. 250 కోట్ల రూపాయలతో భారతమాల ప్రోగ్రాం ద్వారా పోర్టు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, కేంద్ర ప్రభుత్వం నుంచి సంబంధిత నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి అధిక మొత్తంలో నిధులను తీసుకువచ్చినట్లు, సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మచిలీపట్నం నగరంలో డా.భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మానానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, డీఆర్ఓ కె. చంద్రశేఖరరావు, బందరు ఆర్డీఓ ఎం.వాణి, మచిలీపట్నం నగర కమిషనర్ బాపిరాజు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి టి. శివప్రసాద్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, రైట్స్ టీం లీడర్ విశ్వనాథం, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాస్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-గుడివాడ : ఈనెల 27, 28 తేదీల్లో పట్టణంలో జరుగునున్న ఏఐటీయూసీ కృష్ణాజిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిధులు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ టి.తాతయ్య మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారం చేయడం కోసం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక భావాలను తొలగించాలని, విశాఖ ఉక్కుని ప్రైవేటైజేషన్ చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికుల్ని పర్మినెంట్ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కనీస వేతనంగా రూ.26వేలు ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గుడివాడ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్, ఏఐటీయుసీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ, కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ కే సురేష్, ఏఐటియుసి నాయకులు రామకృష్ణ, అప్పల నాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకే 'తల్లికి వందనం' 'అమలు చేయాలి

విశాలాంధ్ర-కూచిపూడి : తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే అనుమతించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. మొవ్వ లో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అమలు చేసే ఈపథకంతో పేద విద్యార్థులు లబ్ధి పొందే అవకాశం ఉంటుందని అలాగే దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశాలు ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టుకొని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు తల్లికివందనంఅమలుపరిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో అసలే అంతంత మాత్రంగా ఉండే విద్యార్థుల సంఖ్య మరింత పడిపోయే అవకాశం ఉంటుందని వారి పేర్కొంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లతా పాటు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా కూడా ఈ విషయంపై దృష్టి పెట్టి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులుముసిబోయిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిమాదివాడవెంకట శ్రీనివాసులు, కృష్ణాజిల్లా ఫైనాన్స్ సెక్రటరీ కొణతం మాధవరావు, జిల్లా కార్యదర్శి పి గోపాలకృష్ణ, సభ్యులు కే స్వరూప రాణి, టి శ్రీనివాసులు, వై వి రమణ కుమార్, సిహెచ్. రత్నమాణిక్యం, ఎం. విజయలక్ష్మి, బి రజిత, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

విశాలాంధ్ర మచిలీపట్నం : గత ప్రభుత్వం మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ కార్మికుల పెండింగ్ అరియర్స్ విస్మరించినందుకే తగిన మూల్యం చెల్లించుకుందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు తాడిపత్రి రామకృష్ణ, ఎర్రంశెట్టి ఈశ్వరరావు మండిపడ్డారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈ నెల 24, 25, 26వ తేదీలలో మదనపల్లిలో నిర్వహించడం జరుగుతున్న సందర్భంగా గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ సెక్రటరీల వ్యవస్థ వచ్చిన తర్వాత చాలా చోట్ల కార్మికులు తమ సెలువు దినాలను కూడా పొందలేని పరిస్థితుల్లోకి గత వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన విధానంపై వారు ధ్వజమెత్తారు. ఎటువంటి ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే మస్టర్ కార్యాలయాలని డివిజన్ ఆఫీసు నుండి సచివాలయాలకు మళ్లించి నటువంటి పరిస్థితులు కార్మికులు ఎదుర్కొంటూ వచ్చామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అఫ్కోర్స్ పేరుతో కార్మికులు వారి పదవీ విరమణ పొందిన లేదా మరణించిన వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఆయా పనులు కల్పించడంలో కొరత వేసేలాగా రాజకీయ జోక్యం కల్పించి కలెక్టర్లను పూర్తి అథారిటీగా మార్చి బాధిత కుటుంబాలకు కాక రాజకీయ నాయకుల కనుసన్నల్లో కొలువులు అప్ప చెప్పడం చాలా దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభించింది కాబట్టే ఉద్యోగ కార్మికులు ప్రభుత్వాన్ని గద్దె దింపి ఉద్యోగ కార్మికుల ఐక్యతను చాటుకున్నామని వారు తెలిపారు. ఈ నెలలో జరిగే వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, మున్సిపల్ యూనియన్ కార్మికులు గొల్ల శ్యామలాదేవి, సిద్దిరెడ్డి కృష్ణ, యర్రంశెట్టి మాధవ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో
కందిపప్పు, బియ్యం

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల అధిక ధరల నియంత్రణకు, ధరల స్థిరీకరణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర గనులు, భూగర్భ జల, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన కందిపప్పు, స్టీమ్డ్ బియ్యం తక్కువ ధరకు అందించాలన్న లక్ష్యంతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్స్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. స్థానిక రైతుబజార్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ ను మంత్రి కొల్లు రవీంద్ర జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు బజార్ల ద్వారా కందిపప్పు, స్టీమ్డ్ బియ్యం విక్రయాలను ప్రారంభించామన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువులు మార్కెట్ ధరల కంటే తక్కువగా ఫైన్ రకం బిపిటీ, సోనామసూరి, రా రైస్ కేజీ రూ.48, స్టీమ్డ్ రైస్ కేజీ రూ.49, దేశవాళీ కందిపప్పు కిలో రూ.160అని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వాణి, డీఎస్ఓ వి.పార్వతి, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, తాసీల్దార్ వెంకటేశ్వరరావు. స్థానిక నాయకులు బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, గొర్రెపాటి గోపీ చంద్, కుంచె నాని, లంకె నారాయణ ప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యన్నారాయణ, ఫణికుమార్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సెక్యూరిటీ పై కేసు నమోదు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం: డెలివరీ కేసుకు సంబంధించిన రోగులను పరామర్శించడానికి వచ్చిన వారిపై చేయిచేసుకున్న ఘటనలో తలకు గాయం కావడంతో సెక్యురిటీపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్లితే మచిలీపట్టణం ప్రభుత్వ ఆసుపత్రిలోని కాన్పుల వార్డులో తాడేపల్లిగూడెంకు చెందిన వారు ప్రసవించడంతో రోగి బంధువులు దూర ప్రయాణం చేసి ఆసుపత్రికి వచ్చారు. రోగిని పలకరించిన అనంతరం కాన్పుల వార్డులోని కారిడార్‌లో భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటూ ఉండగా ఆసుపత్రిలోని సెక్యురిటీ వారిపై వాగ్యవాదానికి దిగారు. మాటామాటా పెరిగి రోగి తరపు బంధువులను సెక్యూరిటీ సిబ్బంది బొర్రా పున్నయ్య తోయ్యడంతో వెనక్కి పడిపోయి తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అత్యవసర విభాగంలో చేర్చగా ఎంఎల్‌సి కేసునమోదు చేశారు. ఆసుపత్రిలో నిబంధనలు అతిక్రమించిన వారికి విధివిధానాలు అర్ధమయ్యేలా చెప్పాల్సిన సెక్యురిటీ సిబ్బంది రోగుల బంధువులపై చేయి చేసుకోవడాన్ని ఖండిస్తున్నారు.

ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-మచిలీపట్నం : కార్మికులందరం యూనియన్‌గా ఉన్నప్పుడే అందరి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్ అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద గురువారం ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద 73వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయుసి అనుబంధ సంస్థగా ఉన్న ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నిస్వార్థంతో ఎర్రజెండా నీడన కార్మికుల సమస్యల పట్ల అలుపెరగని పోరాటం చేసి కార్మికులను వారి చట్టాలను కాపాడుతూ సుదీర్ఘ పోరాటం చేస్తూ 72 ఏళ్లు ముగించిందని, ఇప్పుడు యూనియన్ ఆవిర్భవించి 73వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందని కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా అనునిత్యం చేస్తామని అయిన అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ జిల్లా రీజినల్ కార్యదర్శి వైవిరావు మాట్లాడుతూ1/2019 సర్క్యులర్లను వైలేషన్ కాకుండా అధికారులు నడుచుకోవాలని ఆ జీవో పరిధిలోనే కార్మికులకు ఏ పనిష్మెంట్ అనుకూలంగా ఇవ్వాలని ఆయన అన్నారు. గత 73 ఏళ్లగా ఆర్టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మన యూనియన్ పోరాడిందని ఆయన అన్నారు. కార్మికులందరం కలిసికట్టుగా ఉండి మన సమస్యలు పరిష్కారం కోసం అందరం ముందుకు నడవాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత వైయస్ నారాయణ, బూరగడ్డ ఏసుబాబు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు బెల్లంకొండ కోటేశ్వరరావు, మచిలీపట్నం డిపో యూనియన్ కార్యదర్శి జొన్నలగడ్డ రాజేష్ యాదవ్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి సుంకర రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ ఇన్సూరెన్సు ప్రీమయం, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : లైఫ్ ఇన్సూరెన్సు ప్రీమయం, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలని కోరుతూ మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి కి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐ.సి.ఈ.యు) నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఎంపి వల్లభనేని బాలసౌరి కి ఇన్సూరెన్స్ రంగం లోని సమస్యలను వివరించటం జరిగింది. ట్యాక్స్ మినహాయింపు రద్దు చేయటం, జీ.ఎస్.టి విధించటం వల్ల పాలసీలు చేయటానికి పాలసీదారుల పై భారం పడుతోందని విన్నవించారు. పార్లమెంట్ సమావేశాల్లో తమ సమస్యలను ప్రస్తావించి పరిష్కారం చూపాలని కోరారు. ఎంపి బాలసౌరి మెమోరాండం పైన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె. సుధాకర్,జి.కిషోర్ కుమార్,టి . చంద్రపాల్, ఎల్. రాజశేఖర్, వై. స్వామినాథ్, ఎస్ వి. రత్నారావు, డి. వాసు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ - ఇద్దరి మృతి

విశాలాంధ్ర-గన్నవరం : ఉంగుటూరు మండలం పెద్ద ఆవుటపల్లి వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం గురువారం బైక్‌ను లారీ ఢీకొట్టి, బైక్‌పై నుంచి వెళ్లింది. దీంతో బైక్ ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందాడు. చింతలపూడి మండలం వీరగుంటపల్లికి చెందిన వి. శ్యామ్‌కుమార్ (28), మహిళ వివరాలు తెలియాల్సి ఉంది. ఏలూరు నుండి విజయవాడ వైపు వస్తుండగా ప్రమాదం జరిగింది ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన చెన్నూరు విద్యార్థిని

విశాలాంధ్ర-పెడన : పెడన మండలం చెన్నూరు జిల్లా పరిషత్ హై స్కూలు విద్యార్థిని త్రిబుల్ ఐటీ లో సీటు సాధించింది.పదవ తరగతిలో ఈమె 567 మార్కులు సాధించింది. గ్రామానికి చెందిన పోతన చంద్రికకు శ్రీకాకుళం బ్రాంచ్ లో ఈ సీటు లభించింది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సౌజన్య తెలిపారు. చంద్రికను పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్‌లు పంపిణీ చేశారు. కొత్తపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు గురువారం యలవర్తి నాగమునేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జగదీష్ మాస్టార్ కుటుంబ సభ్యులతో కలిసి 40 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్‌లను పంపిణీ చేశారు.

పరిమిత కుటుంబం - చింతలేని కుటుంబం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- పరిమిత కుటుంబం - చింతలేని కుటుంబం అని పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కె సువర్చల,వి జయశ్రీ ప్రజలకు అవగహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించరు. ప్రతి సంవత్సరం జులై 11 ను ప్రపంచ జనాభా దినోత్సవం గా పాటించడం జరుగుతుందని, గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పెద తుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కె సువర్చల , డాక్టర్ వి జయశ్రీ ఆధ్వర్యంలో ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ అధిక జనాభా వల్ల కలిగే సమస్యలు గురించి తెలియజేయడం జరిగింది. ఆర్థిక పరమైన సమస్యలు వస్తాయని, నిరుద్యోగ సమస్యలు, ధరలు పెరుగుదల, వాతావరణ కాలుష్యం, అంటు రోగాలు ప్రభాలుతాయి అని అవగాహన కల్పించడ మైనది. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడం, బాల్య వివాహాలు నిరోధించడం, తల్లి బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం పాటించడం ద్వారా జనాభా ను నియంత్రించ వచ్చు అని, చిన్న కుటుంబం చింత లేని కుటుంబం అని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపి హెచ్ఇఓ ఎం ఏడుకొండలరావు, హెల్త్ సూపర్ వైజర్ ఎం ఏసుదాసు, హెచ్ వి కమల రత్నం, పి హెచ్ ఎన్ పెద్దిస్వామీ, హెల్త్ అసిస్టెంట్ యునాస్, రాజారావు, ఎం ఎల్ హెచ్ పి ఎస్ , ఎ ఎన్ ఎం ఎస్, ఆశా వలంటీర్స్, ప్రజలు పాల్గొన్నారు.

పూడిక తీత పనులు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడిలో రైతులపొలాలలో ముంపునీరు పోయే మురుగు కాలువ పూడికతీత పనులను గ్రామపంచాయతీ చేపట్టింది. ఆ గ్రామంలోని పక్షుల తోటలోనివేదాంతం వారి ధర్మ చెరువు దగ్గర నుంచి భీమ నది డ్రైన్ వరకు గల మురుగుకాలవసుమారు 25 సంవత్సరాల క్రితం అప్పటి సర్పంచ్ పెరుమూడి కాశీ విశ్వనాథం హయాంలో పనికి ఆహార పథకం ద్వారా కూడిక తీయించారు. అప్పటినుంచి వినియోగంలో ఉన్న ఆ కాలువ కాలక్రమేణ పూడిపోయింది. ఆ ప్రాంతంలోని రైతులు సర్పంచ్ దంపతులు కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి అమర బాలేశ్వరరావు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పూడికతీతలకు శ్రీకారం చుట్టారు.. ఈ పనులను మూడవ వార్డు పంచాయతీ సభ్యులు కాకర్ల శ్రీనివాస్, పామర్రు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వెంపటి గోపాలకృష్ణ (పెదబాబు) పర్యవేక్షణలో తొలి అంకం పూర్తి చేశారు.

మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర -కూచిపూడి : కళాశాలలో చదువుకునే విద్యార్థులు చదువుకోవటంపై దృష్టి పెట్టి ఉన్నతులుగా ఎదగే వయస్సులో డ్రగ్స్, మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులపై దృష్టి సారించరాదని కూచిపూడి ఎస్ఐ బి శ్రీనివాస్ హితవు పలికారు. మొవ్వ వి ఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో హెల్మెట్ మరియు డ్రగ్స్ సంబంధించిన అవగాహన సదస్సు గురువారం కళాశాల పొలిటికల్ సైన్స్ లెక్చరర్ డాక్టర్ ఎం సుందరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ బి.శివ నాగేశ్వరరావు ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూచిపూడి సబ్ ఇన్స్పెక్టర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల నుండి కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, అందరు తప్పనిసరిగా డ్రైవింగ్ నందు హెల్మెట్ ధరించాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్సు కూడా ఉండాలని దానితోపాటు హెల్మెట్ అన్ని సక్రమంగా నియమ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నుండి ప్రతి ఒక్కరూ తమను తాము కాపాడుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డాక్టర్ వసుధ, ఎం .శ్రీనివాస్ ప్రసాద్, పోలీస్ శాఖ సిబ్బంది, జెకెసి సభ్యుడు రాజేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

సేల్‌డీడ్ పోయినది

అన్నపరెడ్డి శ్రీనివాసరావు, తండ్రి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 1-32 పెదకళ్ళేపల్లి గ్రామం మోపిదేవి (మం) అను నేను **ఆర్.ఎస్.నెం.784, 783-1లో ఎసి 1.00 సెంట్లు** పెదకళ్ళేపల్లి గ్రామానికి చెందిన **చలసాని వెంకట కుటుంబరావు, తండ్రి సుబ్బారావు** వద్ద కొనుగోలు చేసిన ఒరిజినల్ సేల్‌డీడ్, **తేది : 31-3-1995 దాక్యుమెంటు నెం.1809/1995, ది. 02-07-2024న** నా ఒరిజినల్ సేల్‌డీడ్ లామినేషన్ కోసం పెదకళ్ళేపల్లి గ్రామంనుండి చల్లపల్లి వెళుచుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైనా దొరికినయెడల ఈక్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

అన్నపరెడ్డి శ్రీనివాసరావు,
తండ్రి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 1-32,
పెదకళ్ళేపల్లి, మోపిదేవి (మం)

కౌవులూరి కళ్యాణమండపంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-గుడివాడ : పిన్నమనేని సిద్దార్థ చిన్న అవుటు పల్లి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో గురువారం పేద ప్రజలు నివసించే స్థానిక 11 వార్డులోని శ్రీ కవులూరి కళ్యాణమండపం లో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ సయ్యద్ జబీన్ మాట్లాడుతూ మెగా మెడికల్ క్యాంపు ద్వారా పలు రకాల ఆరోగ్య సమస్యలతో పాటు దంత సమస్యలు ఉన్నవారికి ఉచిత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు షేక్ ఇబ్రహీం, నాయకులు కరీముల్లా, జాబి, బాజని, డాక్టరు తేజస్విని ,డాక్టరు భార్గవి, ఆఫ్రీన్ వైద్య విద్యార్థులు వరుణ్, దివ్య, అస్మా, నూర్జహాన్, సయ్యద్ మోబీన్, రబ్బానీ, షరీఫ్, నూరు, అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డిప్లమో ప్రాక్టికల్ పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్దేంద్ర యోగి నాట్య కళా పీఠం లో జరుగుతున్న రెండు సంవత్సరాల డిప్లమో కోర్స్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ విషయాన్ని ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ వెల్లడించారు. సోమవారం (8వ తారీకు) నుంచి జరుగుతున్న ఈ పరీక్షల్లో 30 మంది విద్యార్థులు హాజరైనారు. ఈ పరీక్షల నిర్వహణ అధికారిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాద్) డిపార్ట్మెంట్ ఆఫ్ డాన్స్ లెక్చరర్ (ఫ్యాకల్టీ) డాక్టర్ విజయపాల్ పాత్ లోత్. వ్యవహరించారు. ఆ విద్యార్థులకు నట్టువాంగం పై వైస్ ప్రిన్సిపాల్ గా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింత రవి బాలకృష్ణ,గాత్రంపై టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ వేదాంత వెంకట దుర్గా భవాని, మృదంగంపై టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరనాథశాస్త్రి సహకరించారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు ఎంపిక

విశాలాంధ్ర-పమిడిముక్కల: చోరగుడి ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీ కి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం నాదేళ్ల ప్రసాద్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు పొందిన పరసా రాజశ్రీ(ఒంగోలు) ఎ.నిహారిక(శ్రీకాకుళం జిల్లా) కె.శరణ్య (ఒంగోలు) ట్రిపుల్ ఐటీ లో ఎంపికైనట్లు తెలిపారు. కాగా కపిలేశ్వరపురం పాఠశాల నుండి కొడాలి హేమకృష్ణ ఎంపికైనట్లు ప్రభాకర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

శ్మశాన వాటిక పరిశీలన

విశాలాంధ్ర-చల్లపల్లి : 1వ వార్డులో అభివృద్ధి చేస్తున్న హిందూ స్మశాన వాటికను స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ గురువారం మధ్యాహ్నం పరిశీలించారు. మండల పరిషత్ నిధులు రూ. 15లక్షలతో నిర్మించిన నూతన ప్రహరీ గోడ పరిశీలించారు. గత కొన్నేళ్ళ నుంచి అసౌకర్యంగా ఉన్న ఈ స్మశాన వాటికను దాదాపు రూ.కోటిన్నర అంచనాతో సమగ్ర అభివృద్ధి, అన్ని సౌకర్యాల కల్పనకు దాతల సహకారం, మన కోసం మనం ట్రస్ట్, స్వచ్ఛ సుందర చల్లపల్లి రథ సారధులు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి పర్యవేక్షణలో చేపట్టనున్న పనులను డీ.ఆర్.కే.ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వేముల శేషగిరి, తాతా ప్రదీప్, నాదెళ్ల వేణు, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, శానిటరీ ఇన్స్ పెక్టర్ కే.సుధాకర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

తాగునీటిని నిరంతరం పర్యవేక్షించండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : తాగునీటి సరఫరాని నిరంతరం పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ ఏ.మహేష్ సంబందిత అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి కమిషనర్ పర్యటనలో భాగంగా గురువారం చిట్టినగర్ బూస్టర్ పంప్ హౌస్, కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్, 56వ డివిజన్ ఏపీ ఐఐసీ కాలనీలో పర్యటించారు. తొలత చిట్టినగర్‌లోని బూస్టర్ పంపును పరిశీలించి ప్రజలకు త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులను అదేశించారు. అనంతరం కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్‌లో చీఫ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లతో కలిసి పరిశీలించారు. అనంతరం 56వ డివిజన్‌లో పర్యటించి ఇంటింటిలో నీటి నమూనాలను సేకరించి క్లోరిన్ రెసిడ్యూల్ పరీక్షలను నిర్వహించారు. నీటి సరఫరా చేసే ఏ ప్రదేశంలో అయినా ఎటువంటి కలుషితం లేకుండా నిరంతరం పరీక్షలు నిర్వహించేటట్లుగా ఎప్పటికప్పుడు పటిష్టంగా పర్యవేక్షిస్తూ సైడ్ డ్రెయిన్లలో తాగునీటి పైపులు కలవకుండా అసిస్టెంట్ ఇంజనీర్లు జూలై 20 కల్లా తమ పరిధిలో ఎటువంటి తాగునీటి పైప్లైన్లు డ్రెయిన్ల వద్ద కలుషితం జరగటం లేదని ధ్రువీకరించాలన్నారు. ఈ పర్యటనలో సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ఈఈ ఏఎస్ఎన్.ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల్లో రహదారి!

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట ప్రభుత్వాసుపత్రిని ప్రభుత్వం కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసినా, అక్కడికి వెళ్లే రహదారి ఆక్రమణల పాలై, అభివృద్ధికి నోచుకోకపోవటంతో ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతం నుంచి ఈ ప్రాంతంలోని రైతులు వ్యవసాయ అవసరాలు, ఇతరత్రా తమ భూములకు వెళ్లేందుకు ఈ రహదారిపైనే ఆధారపడుతుండగా, వారు సైతం ఆక్రమణల పర్వంలో అవస్థల పాలవుతున్నారు. ఆసుపత్రికి చేరే రహదారి ఆరంభంలో కొందరు దుకాణాలను నిర్మించి, రూ.వేలల్లో అద్దెలకు ఇచ్చారు. మరోవైపు మరికొందరు పెద్దమొత్తంలో శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన రహదారిలో ఆటోలు, వాహనాలు నిలిపి ఉంచటంతో ఆసుపత్రికి వెళ్లే రోగులకు రాకపోకలు సమస్యగా మారాయి. ఇక్కడ ఆక్రమణల తొలగింపునకు దశాబ్దం క్రితం రంగం సిద్ధం చేసినా, ఆచరణకు నోచుకోలేదు.

పెరిగిన సౌకర్యాలు...

విస్సన్నపేట, చాట్రాయి, రెడ్డిగూడెం మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు తమ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి విస్సన్నపేటలోని ప్రభుత్వాసుపత్రి సేవలపై ఆధారపడుతున్నారు. రోజుకు సుమారు 150మందికి పైగా రోగులు వస్తున్న ఈ ఆసుపత్రి స్థాయిని పెంచి, సుమారు రూ.50కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. అదనపు బెడ్లతో పాటు ప్రాంతీయ ఆసుపత్రి తరహాలో వివిధ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఆయా మండలాలకు చెందిన రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యాయత్నం, హత్యాయత్నం వంటి పోలీసు సంబంధిత పలు ఘటనలకు(మెడికో లీగల్ కేసులు) గతంలో తిరువూరు, నూజివీడు ప్రాంతాలకు వెళ్లవలసి ఉండగా, తాజా చర్యలతో విస్సన్నపేట ఆసుపత్రిలోనే అందుబాటులోకి వచ్చాయి. 24గంటల పాటు వైద్యసేవలందించటంతోపాటు, గర్భవతులు, బాలింతలకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రమాదాల్లో మరణించినవారికి శవపరీక్ష, శవాగారం తదితర సేవలను ఇటీవల ప్రారంభించారు. ఇన్ని సదుపాయాలు వచ్చినా, ఇక్కడికి రోగులు చేరుకునే రహదారి ఆక్రమణల పర్వంలో ఉంది.

ఒకవైపు దుకాణాలు, మరోవైపు వాహనాలు

స్థానిక బస్టాండ్ కూడలి వద్ద నుంచి ఆరంభమయ్యే ఈ రహదారి మొదటిలోనే కొందరు ఆక్రమించి, పక్కా దుకాణ సముదాయాలు నిర్మించి, అద్దెలకు ఇచ్చారు. మరికొందరు వ్యాపారులు చిరుదుకాణాలు ఏర్పాటు చేసి, మరికొంత రహదారిని ఆక్రమించారు. అప్పటికే సగానికి పైగా కుంచించుకుపోయిన రహదారిని ఆటోవాలాలు తమ వాహనాలు నిలిపి, ఆటోస్టాండుగా మార్చివేశారు. ఈ మార్గంలో పయనించే ప్రజలు, రోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో 108 తదితర వాహనాల్లో ఆసుపత్రికి వెళ్లే రోగులు, గర్భవతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. పలు సందర్భాల్లో ఆక్రమణల కారణంగా 108 వాహనాలు ఇక్కడ నిలిచి, ఆలస్యంగా ఆసుపత్రికి చేరుకున్న సందర్భాలు అనేకం ఉన్నా, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఆరంభంలోనే నిలిచిన చర్యలు

సుమారు 10 సంవత్సరాల క్రితం అధికారులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రహదారిలో ఆక్రమణలు తొలగించేందుకు రంగం సిద్ధ: చేశారు. రెవిన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో రహదారిని సర్వే చేయించి, మార్కింగ్ ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేసేలోగా ఆక్రమణ తొలగింపు చర్యలు ఆగిపోయాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆక్రమణల తొలగింపు నిలిచిపోయినట్లు ప్రజల నుంచి ఆరోపణలు వచ్చినా, అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకున్న చర్యలు మాత్రం ఆనాటి నుంచి ఈ నాటి శూన్యం. ఇప్పటికైనా అభివృద్ధి పరిచిన ఆసుపత్రిని ప్రజలు వినియోగించుకునేలా రహదారి ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఈయూ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-తిరువూరు: ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ ఆధ్వర్యంలో తిరువూరు డిపోలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఏస్.కె.నాగుల్ మీరా, పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ సహాయ కార్యదర్శి బి.రవిచంద్ర, ఉపాధ్యక్షులు యం.వి.కె.రావు హాజరయ్యారు. ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భవించినప్పటి నుండి ఈనాటి వరకు కార్మికుల సంక్షేమం కోసమే పని చేసిందని, అవసరమైతే ఐక్యఉద్యమాలు నిర్మించి అందరినీ కలుపుకొని సమ్మెలకు కూడా వెనకాడకుండా సమ్మెలు చేసి కార్మికులకు మెరుగైన పేస్కేల్ అమలు చేసేందుకు కృషి చేసిందని అన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం అనంతర సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తోందని, అమరావతి జేఏసీతో కలసి ఉద్యోగుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తుందని, పలిశెట్టి దామోదరం నాయకత్వములో యూనియన్ బాగా పనిచేస్తున్నారని, అందరూ సమిష్టిగా కృషి చేసి యూనియన్ ని బలోపేతం చేయాలని అన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ జెండాను సీనియర్ కామ్రేడ్ టి.ఏస్. రామారావు ఆవిష్కరించారు. సోమేశ్వరరావు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. ఈ వేడుకలకు ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, అధ్యక్షులు పి.రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఏస్. ఎన్.కె.రెడ్డి, గేరాజ్ కార్యదర్శి చి.హెచ్. ఆదినారాయణ, నాగుల్‌మీరా, కోశాధికారి వి.స్టాలిన్‌బాబు, బ్రహ్మం, సాంబశివరావు, ఆర్.రామారావు మొదలగు వారు నాయకత్వం వహించారు. యూనియన్ కార్యక్రమాలకు ఆకర్షితులై ఎస్.ఎం.యు యూనిటీ అసోసియేషన్ నుండి కె.నాగరాజు, బి.భాస్కర్, ఏస్.కె. సుభాని ఎంప్లాయిస్ యూనియన్‌లో చేర్చారు.

చివరి ఆయకట్టు వరకు నీరిస్తాం : ఎమ్మెల్యే సౌమ్య

విశాలాంధ్ర-కంచికచర్ల: రైతులకు శబరి ఆయకట్టు వరకు పంటలకు పుష్కలంగా నీరందిస్తామని స్తామని రైతన్నల శ్రేయస్సేఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన ఏజెండాని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మండల పరిధిలోని చెవిటికల్లు గని ఆత్కూరు పంపింగ్ స్కీములను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతులు సాగు చేసుకునేందుకు పంటలకు పుష్కలంగా నీరు అందించడమే సీఎం నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అని ఎమ్మెల్యే అన్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతన్నలకు ఎల్లవేళలా అండగా ఉండ టమే కాక వాళ్ళ సంక్షేమ అభివృద్ధి కోసం నిరంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు,కోగంటి విష్ణు, గోగుల గుంట రామకృష్ణ, మోర కొండ ఏడుకొండలు,గుత్తా రత్నం,గని ఆత్కూరు సర్పంచ్ షేక్ ఇబ్రహీం, ఎంపీటీసీ సభ్యులు వెంపరాల వెంకటేశ్వరావు,స్కీం అధ్యక్ష ఉపాధ్య క్షులు కోపూరి చంద్రశేఖర్, వెంపరాల అచ్చయ్య,ఉపాధ్యక్షులు గోగులగుంట రవికుమార్,నాగర్జునరావు,భాస్కర్ రావు,గుదే నరేష్,మండడపు వాసు, రైతులు పాల్గొన్నారు.

రన్నింగ్ సిబ్బందికి ప్రత్యేక వసతులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రన్నింగ్ సిబ్బంది(లోకో పైలెట్స్-ట్రైన్ మేనేజర్స్)కు అవసరమైన ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని డివిజనల్ రైల్వేమేనేజర్ (డిఆర్ఎం) నరేంద్ర ఎ.పాటిల్ తెలిపారు. లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపై లైట్, ట్రెయిన్ మేనేజర్లకు కల్పిస్తున్న సౌకర్యాలు గురించి తెలియజేయటానికి గురువారం మీడియాను రన్నింగ్ క్రూ నెటప్స్ తీసుకువెళ్ళి స్వయంగా వివరించారు. అనంతరం డిఆర్ఎం మాట్లాడుతూ ఒకసారి క్రూ ఒక ట్రిప్పు వెళ్లి వచ్చిన తర్వాత విశ్రాంతి తీసుకునేందుకు డివిజన్‌లో అత్యాధునిక సౌకర్యవంతమైన రన్నింగ్ రూములు, లాబీలు అందుబాటులో ఉంటాయన్నారు. ఒకసారి క్రూసైన్ ఆన్ అయిన తరువాత గదులు కేటాయిస్తారన్నారు. ఆ తర్వాత వారు పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు నిర్ధారించు కున్న తర్వాతనే రైలుకు కాల్బుక్ చేస్తామని వివరించారు. డిఆర్ఎం వెంట ఏడిఆర్ఎం శ్రీనివాసరావు కొండా (ఆపరేషన్స్), డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (ట్రాక్షన్ రోలింగ్ స్టాక్ ఆపరేషన్స్-టిఆర్ఎస్ఓ) బి.శ్రీనివాసులు, ఎడిఈఈ(ఆపరేషన్స్) రవితేజ, ప్రజా సందంధాల అధికారి నుస్రత్ ఎమ్ మండ్రూప్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-విజయవాడ: మొగల్రాజపురం సెక్షన్, మహాత్మా గాంధీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ జమ్మి చెట్టు ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుండి 11 గంటల వరకూ వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీరు బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు: బాడవ పేట కొంత ఏరియా, జాన్ స్ట్రీట్, జక్రయ్య వీధి, ఎల్లాటి ఆంజనేయులు వీధి, కార్వే ఆఫీస్ ఏరియా, స్టేడియం వాటర్ ట్యాంక్ రోడ్డు, వీఎంసీ వాటర్ వర్క్స్, బందరు రోడ్, వరమహాలక్ష్మి రోడ్, తెంటు గౌరయ్య వీధి, తుర్లపాటి కుటుంబరావు వీధి, రుక్మిణి రైస్ మిల్ రోడ్, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విస్సన్నపేటలో ఎమ్మెల్యే కొలికపూడి ప్రజాదర్బార్

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో గురువారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఉదయం 9గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవ్వగా, అర్జీలు ఇచ్చేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. ఎమ్మెల్యేను కలుసుకునేందుకు అధికారులు టోకెన్ విధానం ప్రవేశపెట్టి, వరుసక్రమంలో అనుమతించారు. సుమారు వెయ్యి మంది అధికారుల వద్ద తమ పేర్లు నమోదు చేసుకుని, అర్జీలు దాఖలు చేశారు. బీసీ, ఎస్సీలకు 50 సంవత్సరాలకే పింఛను, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు, నివేశనస్థలం, పింఛను తదితరాల కోసం ఎమ్మెల్యేకు అర్జీ దాఖలు చేయమంటూ పలు ప్రాంతాల టీడీపీ నేతలు చేసిన ప్రచారంతో పెద్దసంఖ్యలో ప్రజలు బారులు తీరగా, వారిని అదుపు చేయటం అధికారులకు తలనొప్పిగా మారింది.

రైతు బజార్‌లో కందిపప్పు-బియ్యం విక్రయాలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : నిత్యావసర సరుకుల ధరలను సామాన్యుడికి అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని దానిలో భాగంగా గురువారం ఏపీఐఐసీ కాలనీలోని రైతు బజార్ లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వక్కలగడ్డ భాస్కరరావు తెలిపారు. రైతు బజార్ లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైస్ మిలర్స్, దాల్ మిలర్స్ వారి సహకారంతో బియ్యం, కంది పప్పు అమ్మకాల కౌంటర్ ను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశాం అన్నారు. కందిపప్పు బహిరంగ మార్కెట్ లో దాదాపు కిలో రూ.181 అమ్ముతున్నారు. బియ్యం ధరలు ఆకాశాన్ని అంటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ అవుట్ లెట్లు ప్రారంభించాం.ఈ అవుట్ లెట్లలో కిలో దేశవాళి కందిపప్పు రూ.160కే అందిస్తున్నాం.అలాగే సోనామసూరి (స్టీమ్డ్) కిలో రూ.49,సాధారణ రకం రూ.48 విక్రయిస్తున్నాం. ప్రతి రోజు 125 క్వింటాల కందిపప్పు అందుబాటులో ఉండేటట్లు ఏర్పాట్లు చేస్తున్నాము. ప్రజల డిమాండ్ ఆధారంగా పెంచుతాం. రాబోయే రోజుల్లో కందిపప్పు, బియ్యంతో పాటు మిల్లెట్స్, పంచదార, రాగి పిండి తక్కువ ధరకే అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.రైస్ మిలర్స్, దాల్ మిలర్స్ వారి సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్,పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): యువతరం ట్రాఫిక్ రూల్స్‌ను దిక్కరించి ప్రమాదాల బారిన పడవద్దని, తమ విలువైన ప్రాణమాలను బలిపెట్టవద్దని విజయవాడ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్) డీ ప్రసాద్ అన్నారు. అన్నారు. విజయవాడ సిటీ పోలీసు, కాకరపర్తి భావనారాయణ కళాశాల, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హజరైన అడిషనల్ డీసీపీ డీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత అత్యధికంగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతుందన్నారు. యువత తమ వయస్సు రీత్యా వచ్చిన ఉత్సాహంతో ట్రాఫిక్ రూల్స్‌ను పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించటం వలన తమ విలువైన ప్రాణాలను పొగొట్టుకుంటున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువకులే అత్యధికంగా ప్రాణాలను పొగొట్టుకుంటున్నారని చెప్పారు. దానివలన ఆ కుటుంబంలోని తల్లిదండ్రుల మనోవ్యధను ఎవరూ తీర్చలేరన్నారు. తమ కుమారుడు మరణిస్తే ఆ కుటుంబం తెరుకోవటానికి చాలా సమయం పడుతుందన్నారు. కేవలం ఆ కుటుంబమే కాకుండా యువత అభ్యున్నతిపైన ఆధారపడిన దేశాభివృద్ధి సైతం కుంటుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. తప్పనిసరిగా నాణ్యత కలిగిన హెల్మెంట్‌ను వినియోగించాలన్నారు. హెల్మెట్ వాడకపోవటం వలన సగానిపైగా మరణాలు సంభవిస్తున్నాయని గుర్తు చేశారు. మంగల లీగల్ సర్వీసెస్ కమిటీ లీగల్ సర్వీసెస్ ఆఫీసర్ పీ రాము మాట్లాడుతూ మోటారు వెహికల్‌కు సంబంధించి నూతన చట్టాలను మరింత కట్టుదిట్టం చేశారన్నారు. నిబంధనలను ఉల్లంఘించి చట్టాలను అతిక్రమిస్తే భారీ జరిమానాలను విధించటం జరుగుతుందన్నారు. అయితే జరిమానాల కన్నా విలువైన ప్రాణాలను రోడ్డు ప్రమాదాల బారిన పడి బలితీసుకోవద్దని సూచించారు. చట్టాల ఏమి చెబుతున్నది విద్యార్థులకు వివరించారు. ఏసీపీ వెస్ట్ (ట్రాఫిక్) బీ జనార్ధనరావు మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించటం ద్వారా సమాజానికి మేలు చేసినవారవుతారన్నారు. నిబంధనలను పాటించి మీకు, మీ ఎదుటి వారికి ప్రమాదాలను నివారించాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు అధ్యక్షత వహించారు. ట్రాఫిక్ సీఐలు బీ వెంకటేశ్వరరావు, ఆర్ సూర్యభాస్కర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ఎన్ సాంబశివరావు, డీ పవన్‌కుమార్, కల్మాబేగం, ఎన్‌సీసీ ఆఫీసర్ టీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు ఆషాఢ సారె

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి, గ్రామంలోని మహిళలు ఆషాడం సారెను గురువారం సమర్పించారు. ముందుగా అమ్మవారి రంగుల మండపం(పెద్ద వేప చెట్టు) దగ్గర నుంచి మహిళలు భారీగా పాల్గొని ర్యాలీగా వెళ్లి అమ్మవారికి మరియు సహదేవతలకు ఆషాడం సారే సమర్పించారు,అమ్మవారి దేవస్థానంలోని నిత్య కళ్యాణ మండపం వద్ద ఆషాడం సారెను ఉంచి వేద పండితుల మంత్రోచ్ఛర్ణ చేసిన అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మరియు దేవస్థాన కార్యనిర్వహణాధికారి, కె రమేష్ నాయుడు, ధర్మకర్తల మండల చైర్మన్ జంగాల శ్రీనివాసరావు(వాసు), ధర్మకర్తల మండల సభ్యులు,గ్రామ మాజీ సర్పంచ్ చింతల. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు,అనంతరం అమ్మవారి దేవస్థానం వారు ఏర్పాటుచేసిన అన్న ప్రసాదాన్ని అందరూ స్వీకరించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫొటోలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలకు కొంతమంది తిలోదకాలు ఇస్తున్నారని విజయవాడ 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షరాలు తిరుపతి అనూష, సురేష్‌లు అన్నారు. గురువారం 127వ సచివాలయంలో సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో సైకో పాలనకు చరమగీతం పాడిన తరువాత కూడా

కొందరు మాజీ ముఖ్యమంత్రిపై ఉన్న ప్రేమను వదులుకోలేక పోతున్నారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చాలా సచివాలయాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేయలేదని అన్నారు. అధికారులు తమకు సి ఎమ్ డిప్యూటీ సీఎం ఫొటోలు ఇంకా ఇవ్వలేదనే సమాధానం ఇస్తున్న సచివాలయం సిబ్బంది మాటల్లో ఎంత నిజముందో నిగ్గుతీయాలని తిరుపతి దంపతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో పెద్ది సతీష్, తిరుమరెడ్డి గణేష్, పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

విశాలాంధ్ర-విజయవాడ (ఇంద్రకీలాద్రి): ఆషాఢ మాసం సందర్భంగా దుర్గమ్మకు గురువారం పలువురు భక్తులు, భక్త బృందాలు సారెను సమర్పించారు. సమర్పణకు పెద్ద ఎత్తున భక్త బృందాలు, భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. శ్రీభమరాంబిక సేవా సమితి మచిలీపట్నం భక్త బృందం అమ్మవారికి సారె సమర్పించారు. భక్త బృందాలకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి యూ.దుర్గాప్రసాద్‌రావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారు ఇంద్రకీలాద్రి పై చేరుగానే ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఖడ్గమాలార్చన సేవలో పాల్గొన్నారు. వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదాలు, శేష వస్త్రము, చిత్రపటం అందజేశారు. అలాగే రాష్ట్ర కార్మిక శాఖ, ఉపాధి శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇస్లామిక్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మదీనా ఇస్లామిక్ జుమ్మా మొహర్రం క్యాలెండర్‌ను గురువారం విజయవాడ పంజా సెంటర్‌లోని లోటేచోటేబాబా దర్గాలో ఆవిష్కరించారు. మదీనా ఇస్లామిక్ జుమ్మా మోహర్రం క్యాలెండర్ వ్యవస్థాపకుడు షేక్.అబ్దుల్ అహ్మద్ ఖాదరీ, సితార సెంటర్‌లోని మదీనా మజీద్ ఇమామ్ గౌస్‌మోహీద్దీన్‌లు ముస్లిం సోదరులకు క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం క్యాలెండర్‌లో మొదటి నెల అయిన ముహర్రం జూలై నెలలో ప్రారంభమవుతుందని, ఇది కొత్త మాసాన్ని హీజ్రి, అల్లా మాసం అని కూడా పిలుస్తురన్నారు. ఈ మాసం ముస్లింకు గొప్ప ప్రముఖ్యత ఉందన్నారు. ముహర్రం పదోరోజున కర్బలా యుద్ధంలో అమర వీరుడు అయిన ప్రవక్త

ముహమ్మద్ మనవడు హూస్సేన్ ఇబ్న్ ఆలీ మరణాన్ని స్మరించుకుంటారన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ముస్లీం సోదరులు జీవించాలని, ఇస్లామిక్ నెలలు, దినాలను పాటించాలని చెప్పారు. ప్రతి ఇంటిలో ఇస్లామిక్ క్యాలెండర్ ఉండాలని చెప్పారు. నాలుగేళ్ల నుంచి ఈ క్యాలెండర్ ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని నిర్వహకులు తెలిపారు. ఇస్లాం ప్రకారం ప్రతి ముస్లీం సోదరులు నడుచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, బాబూ భాయ్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

పాత విధానాన్నే అమలుచేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : నూతన పెన్షన్ వలన కార్మికులకు అన్యాయం జరుగుతుందని పాత విధానాన్నే అమలు చేయాలి అని ఎంప్లాయిస్‌సంఘ్ అధ్యక్ష,కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరరావు, ఆకుల రాఘవేంద్రరావు డిమాండ్ చేశారు. ఎన్ జే.ఏ.సీ నాయకులు ఎన్.ఎఫ్ ఐ.ఆర్,ఎస్.సీ.ఆర్ సంఘ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య ఇచ్చిన పిలుపు మేరకు గురువారం డి.ఆర్.ఎం కార్యాలయం మెయిన్ గేటు వద్ద గెట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. నూతన పెన్షన్ విధానం కార్మికులకు అన్యాయం జరుగుతుందనీ, ఉద్యోగ విరమణ తర్వాత బిచ్చగాళ్ళుగా తయారు చేస్తుందని విమర్శించారు. రైల్వేలో కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి రైల్వేలను అభివృద్ధి బాటలో నడిపించి, రిటైర్డ్ అయిన తరువాత కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితులకు దిగజారుతున్నారన్నారు. ఎన్.పీ.ఎస్ రద్దు కోసం, స్ట్రైక్ బ్యాలెట్,గేట్ మీటింగ్లు ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు చేశామని ప్రస్తుతం అన్ని డివిజన్లలో లంచ్ అవర్ గేట్ మీటింగ్ లు నిర్వహిస్తున్నారు. ఈ ధర్నాలో సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్లు రమేష్,దేగల శ్రీను, బ్రాంచి కార్యదర్శులు బసవపున్నయ్య, కర్నూలు సుకుమార్,శ్యాంబాబు,దాసు,బాలాజీ, ఇంజనీరింగ్ బ్రాంచి అధ్యక్షుడు కొయ్యరమణారెడ్డి,ఎం శ్రీనివాసరావు,సుగుణకుమారి,రాధిక సుప్రియ,బ్రాంచి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి మా స్థలానికి విముక్తి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ భవానీపురం శివాలయం సెంటర్ వద్ద ఉన్న తమ స్థలాన్ని ఆక్రమణదారులనుండి కాపాడుకునేందుకు వీలు కల్పించిన రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి స్థల యజమాని సామల వెంకటేశ్వర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సాయంత్రం 42వ డివిజన్ శివాలయం సెంటర్లోనీ తన స్థలం వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. తాము గతంలో స్థానిక 42 డివిజన్ కార్పొరేటర్ పి. చైతన్య రెడ్డి మామ సుబ్బారెడ్డి తో కలిసి ఆ ప్రాంతంలో దాదాపు 240 గజాల స్థలాన్ని ముగ్గురం కలిసి కొనుగోలు చేయడం జరిగిందని, ఆ స్థలంలో షాపులు నిర్మించడం జరిగిందని వివరించారు. అయితే తన వాటాకు రావలసిన అద్దెలను ఏనాడు సుబ్బారెడ్డి తనకు ఇవ్వలేదని, పైపెచ్చు ఆ స్థలాన్ని తమకే అమ్మాలని పలుమార్లు బెదిరించాడని చెప్పారు. ఈ విషయమై తాను భవానిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా నాటి వైసిపి ప్రభుత్వ హయాంలో తనకు ఏ మాత్రం న్యాయం జరగలేదని వెంకటేశ్వర రెడ్డి వివరించారు . అలాగే తనపై ఎదురు కేసులు కూడా పెట్టారని చెప్పారు. అయితే రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత తన స్థలం తనకు దక్కిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ,విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని , విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన వాటా స్థలాన్ని తాను తీసుకున్నానని, అయితే తనకు రావలసిన షాపులు అద్దెలు మాత్రం ఇంతవరకు సుబ్బారెడ్డి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి కూడా పాల్గొని తమ స్థలం తమకు దక్కినందుకు చంద్రబాబు ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో పెరటి తోటలు పెంచాలి : కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలోని 100 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా పోషకాహార పెరటి తోటలను పెంచాలని జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ విద్యాధికారులకు పిలుపునిచ్చారు. నగరంలోని సన్ స్టార్ పాఠశాలలో గురువారం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం జిల్లా విద్యాశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీకె. బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 100 పాఠశాలల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పోషకాహార పెరటి తోటల పెంపకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రానురాను కాలుష్యం ఎక్కువ అవుతుందని, క్రిమిసంహారక మందుల వాడకం ఎక్కువ అవుతుందని, పండించే రైతుకు ఖర్చు ఎక్కువై ఆదాయం తగ్గిపోతుందని, వినియోగ దారులు డబ్బు పెట్టినా ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. భూమికి కాంప్లెక్స్ ఎరువులు, క్రిమి సంహారక మందులు వేయడం వలన రానురాను భూమి సారం కోల్పోతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం వైపు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మహారాష్ట్రలో సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయం వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ ఉద్దేశ్యంతోనే ప్రకృతి వ్యవసాయంపై చిన్నతనం నుండి పిల్లలకు తెలియచేయాలనే సంకల్పంతో పాఠశాల స్థాయి నుండి పెరటి తోటల పెంపకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. తొలి దశలో రైతు సాధికార సంస్థలు ఎక్కడ ఉన్నాయో అక్కడ ఉన్న పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. చిన్నతనం నుండి పిల్లలకు విత్తన శుద్ధి, ఘన, ద్రవ, బీజామృతాలు అంటే ఏమిటో వాటి వలన మొక్కలు ఎంత బాగా పెరుగుతాయో అనే విషయం పైన వారికి అవగాహన కలిగించాలన్నారు. ఎంఈఓ లు, ప్రదానోపాధ్యాయులు, పి.ఈ.టీ.లు, ఉపాధ్యాయులు అందరూ కలిసి ఒక బృందంగా పనిచేసి ప్రతి స్థాయిలోనూ విజయవంతం చేయాన్నారు. పాఠశాలలో ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులను మినహాయించి మిగిలిన విద్యార్థులకు ఈ కార్యక్రమం పైన సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు. తద్వారా మాతృభూమికి గౌరవ వందనం చేసినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఒక బాధ్యతగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. వ్యవసాయ శాఖ ఏడి పార్థసారథి ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించారు. మోపిదేవి ప్రధానోపాధ్యాయురాలు జయంతి తాను ప్రకృతి వ్యవసాయం ద్వారా పాఠశాలలో పెరటి తోటలను పెంచుతున్నట్లు జిల్లా కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ ఆమెను అభినందిస్తూ తమ అనుభవాలను తెలియజేయాలన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సన్‌స్టార్ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు వై. అభినవ్ ప్రీతం గణితంలోనూ, క్యూబ్స్ లోనూ ప్రతిభ కనపరచడంతో జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి తహేరా సుల్తానా, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. పద్మావతి, జిల్లా పంచాయితీ అధికారి నాగేశ్వరరావు నాయక్, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్ అహ్మద్ కేవికే కోఆర్డినేటర్ శ్రీలత, సన్ స్టార్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీరామ్, ప్రధానోపాధ్యాయులు రవికాంత్, పలువురు మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యువెలరీ ఎమినెన్స్ అవార్డ్స్ 2024లో అత్యున్నత గౌరవాన్ని పొందిన కీర్తిలాల్స్

విశాలాంధ్ర-విజయవాడ : సాటిలేని హస్తకళా నైపుణ్యానికి, కాలాతీత శోభకి మారుపేరుగా నిలిచే కీర్తిలాల్స్, జైపూర్‌లో జరిగిన జ్యువెలరీ ఎమినెన్స్ అవార్డ్స్ (జేఈఏ) 2024లో రెండు ప్రతిష్టాత్మక అవార్డులని గెలుచుకుంది. ఈ బ్రాండ్ అక్కడ "జెమ్‌ఫీల్డ్స్ కలర్ స్టోన్ బ్రైడల్ జ్యువెలరీ", ఇంకా "డైమండ్ బేంగిల్ / బ్రేస్లెట్" అవార్డులని అందుకుంది. ఈ సందర్భంగా కీర్తి లాల్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ మాట్లాడుతూ బ్రాండ్‌కు ఆభరణాల రూపకల్పనలో నవీకరణ, సృజనాత్మకత, శ్రేష్టతపట్ల వున్న నిబద్ధతకుగాను ఈ అవార్డులు గుర్తింపుగా నిలుస్తాయన్నారు. కీర్తిలాల్స్ సాధించిన ఈ విజయం సాంప్రదాయం, ఆధునికతల మేలు కలయికతో విశిష్టమైన ఆభరణాలని రూపుదిద్దడంలో ప్రత్యేకతని తెలుపుతుందన్నారు. మనసుని దోచుకునే శ్రేష్టమైన నగల్ని రూపుదిద్దడానికి సాంప్రదాయ హస్తకళానైపుణ్యాన్ని, సమకాలీన డిజైన్‌లతో మేళవించి కీర్తిలాల్స్ ఎప్పుడూ పరిశ్రమలో సరికొత్త ప్రమాణాల్ని నెలకొల్పడాన్ని కొనసాగిస్తూనే వుందన్నారు. సున్నితమైన, అతిచక్కటి ఆభరణాల విషయంలో తన సారథ్యస్థానాన్ని మరోసారి దృఢపరుచుకుంటూ పరిశ్రమ సారథిగా కీర్తిలాల్స్ తన స్థానాన్ని నిలబెట్టుకుందన్నారు.

శాంసంగ్ నుంచి గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్6

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్యారిస్‌లో జరిగిన గెలాక్సీ అన్‌ప్యాక్డ్ కార్యక్రమంలో గెలాక్సీ బడ్స్3, గెలాక్సీ బడ్స్3 ప్రోతో పాటు తమ సరికొత్త గెలాక్సీ జెడ్ ఫోల్డ్6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్6ని విడుదల చేస్తున్నట్లు శాంసంగ్ వెల్లడించింది. కొత్త గెలాక్సీ జెడ్ సిరీస్ పరిచయంతో, శాంసంగ్ తమ అత్యంత వైవిధ్యమైన, అనువైన ఫారమ్ ఫ్యాక్టర్‌ని ఉపయోగించడం ద్వారా వినూత్నమైన మొబైల్ అనుభవాలను అందించటం ద్వారా గెలాక్సీ ఏఐ యొక్క తదుపరి అధ్యాయాన్ని తెరుస్తోంది. గెలాక్సీ ఏఐ కమ్యూనికేషన్, ఉత్పాదకత, సృజనాత్మకత యొక్క కొత్త శకాన్ని వేగవంతం చేయడానికి శక్తివంతమైన, తెలివైన, మన్నికైన ఫోల్డబుల్ అనుభవాన్ని ఉపయోగిస్తుంది.

అధునాతన పడ్లింగ్ సొల్యూషన్లతో రైతులకు సాధికారత కల్పిస్తున్న స్వరాజ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో ప్రత్యేకంగా మాగాణి నేలల్లో సాగులో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు మహీంద్రా గ్రూప్ లో భాగమైన స్వరాజ్ ట్రాక్టర్స్ సమగ్రమైన పడ్లింగ్ సొల్యూషన్స్ ను అందిస్తోంది. స్వరాజ్ 843 ఎఫ్‌ఎం, 742 ఎక్స్, 744 ఎఫ్ఎస్ఈ, స్వరాజ్ 855 ఎస్ఈ అనే స్వరాజ్ మోడల్స్ లో అధునాతన ఫీచర్లు పొందుపర్చబడ్డాయి. స్వరాజ్ ట్రాక్టర్లు 4-వీల్ డ్రైవ్ ఆప్షన్తో లభిస్తాయి. తడి, బురద నేలల్లో కూడా ఇవి అత్యుత్తమ కర్షణ సామర్థ్యాన్ని అందిస్తాయి. పనులు నిరాటంకంగా సాగేందుకు, జారి పడే సమస్యలు తలెత్తకుండా ఇవి సమర్థంగా పని చేస్తాయి. ఈ ట్రాక్టర్లలో 12 ఫార్వర్డ్, 3 రివర్స్ గేర్లతో విస్తృతమైన స్పీడ్ శ్రేణి ఉంటుంది. గరిష్ట పడ్లింగ్ వేగాలను అందించేందుకు, సమర్థమంతమైన, ప్రభావవంతమైన పడ్లింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన సౌత్ స్పీడ్ వేరియంట్ ను స్వరాజ్ అందిస్తోంది. వినూత్నమైన 1-ఆర్ గేర్ సెటప్ ను ఫార్వర్డ్ గేర్ కు ఎదురుగా ఉంచడం వల్ల ఫార్వర్డ్, రివర్స్ గేర్లను మార్చడం వేగంగా, సులభతరంగా ఉంటుంది.

'లైఫ్ కంటిన్యుటీ' ఆప్షన్ అందుబాటులోకి తెచ్చిన ఐసీఐసీఐ ప్రూ ఐప్రొటెక్ట్ స్మార్ట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అత్యధికంగా అమ్ముడవుతున్న ఐసీఐసీఐ ప్రూ ఐప్రొటెక్ట్ స్మార్ట్ పాలసీలో 'లైఫ్ కంటిన్యుటీ' ఆప్షన్‌ను ఆఫర్ చేస్తోంది. క్లెయిమ్ మొత్తాన్ని పాలసీదారు కుటుంబం నెలవారీ ఆదాయం రూపంలో పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఒక్కసారిగా పెద్ద మొత్తం వస్తే దాన్ని ఎలా నిర్వహించుకోవాలనేది అంతగా తెలియని కుటుంబాల కోసం ఇది ఉపయోగకరంగా ఉంటుంది. క్రిటికల్ ఇల్‌నెస్ అనేది తప్పకుండా తీసుకోతగిన మరో విలువైన యాడ్ ఆన్ బెనిఫిట్ కాగలదు. అదనంగా నామమాత్రపు ప్రీమియంతో ఐప్రొటెక్ట్ స్మార్ట్ అనేది క్రిటికల్ ఇల్‌నెస్ ప్రయోజనాలను కల్పిస్తుంది. క్యాన్సర్, కిడ్నీలు దెబ్బతినడం, ల్యుకేమియా, పార్కిన్సన్స్ మొదలైన 34 రకాల సమస్యలకు ఇది కవరేజి ఇస్తుంది. రుగ్మత నిర్ధారణ అయినంతనే క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్ కింద క్లెయిమ్ మొత్తం చెల్లించబడుతుంది. దీనితో వైద్య చికిత్సకు అవసరమయ్యే నిధులు సత్వరం అందుబాటులో ఉండగలవు.

అక్రమ రవాణాను సహించేది లేదు

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

విశాలాంధ్ర-చల్లపల్లి : రేషన్ బియ్యం అక్రమ రవాణాలను సహించేది లేదని స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సబ్సిడీపై బియ్యం కందిపప్పు విక్రయ కార్యక్రమాన్ని చల్లపల్లిలోని రైతు బజార్లో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారధ్యంలో పౌర సరఫరాల శాఖను రాష్ట్ర మంత్రి నాదెళ్ల మనోహర్ సమగ్ర ప్రక్షాళన చేపట్టారన్నారు. గత ప్రభుత్వంలో సన్న బియ్యం ఇస్తామన్న మంత్రులు ఏ విధంగా మాట్లాడారో రాష్ట్ర ప్రజలు గమనించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వేల టన్నుల రేషన్ బియ్యం కాకినాడ పోర్ట్ ద్వారా విదేశాలకు తరలిపోవటాన్ని అడ్డుకున్నారన్నారు. రేషన్ డోర్ డెలివరీ పేరుతో ఏర్పాటు చేసిన వాహనాల ద్వారానే అనేక చోట్ల రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలించిన ఉదంతాలు అనేకం వెలుగు చూసాయన్నారు. తూకంలో మోసాలతో రేషన్ బియ్యం దోపిడీ విపరీతంగా జరిగిందన్నారు. ఇలాంటి వ్యవహారాలన్నీ అరికట్టి ప్రజా పంపిణీ వ్యవస్థను క్రమబద్ధీకరించటంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించేందుకు నాదెళ్ల మనోహర్ కృషి చేస్తున్నారన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఎలాంటి అక్రమ రవాణా ప్రోత్సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డిప్యూటీ తాసిల్దార్ కుమార్, ఇంచార్జి ఆర్ఐ కృష్ణమోహన్, ఎస్టేట్ అధికారి లంకె బలి చక్రవర్తి, పీడీఎస్ డీటీ నరసింహారావు, దివిసీమ రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), తోట కనకదుర్గ, టీడీపీ, జనసేన నాయకులు మోర్ల శివ, రావి చిట్టీ, గొరిపర్తి సుబ్బారావు, నల్లమోతు వీరయ్య, బొందలపాటి వీరబాబు, తుటారం ప్రసాద్, షేక్ సిలార్, జల్లూరి ప్రసాద్, పసుపులేటి రవి, మురళీకృష్ణ, గోళ్ళ ప్రసాద్, పంచాయతీ ఈఓ మాధవేంద్రరావు, శానిటరీ ఇన్స్ పెక్టర్ కే.సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే బుద్ధప్రసాదుకు కోలాటం గురువు వేముల అంకంబొట్లు శిష్యబృందమైన రైతుబజారు స్టాల్స్ డ్వాక్రా మహిళలు కోలాట ప్రదర్శనతో స్వాగతం పలికారు.

జిల్లా బైలాజికల్ సైన్సు ఫోరం ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లా బైలాజికల్ సైన్సు ఫోరం ఏర్పాటైయింది. విజయవాడ గవర్నర్‌పేలోని సీవీఆర్ ఎంసీ హై స్కూల్ ప్లస్ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుల సమావేశం గురువారం జరిగింది. సైన్సు బోధన, ప్రయోగాలు, సమస్యలు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక జరిగింది. గౌరవ అధ్యక్షులు: డాక్టర్ వీటీఆర్ నెహ్రూ, అధ్యక్షులు: డాక్టర్ మామిడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు: ఎస్ఎన్‌వీ.జయలక్ష్మి, ఏ.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి: వై. నాగరామారావు, కోశాధికారి: సీహెచ్ రఘుపతిమ్మ, ఎం.లింగారెడ్డి, కార్యదర్శులు: వై.ఏడుకొండలు, షేక్ ఎం వలి, షేక్ ఖుద్దూస్,సీహెచ్ శివ, ఎన్.అవని,రాధ, టి. శ్రీదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-గుడివాడ : లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ, లైన్స్ క్లబ్ ఆఫ్ సంఘమిత్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరిరావు నూతన అధ్యక్షులు ఉప్పలపాటి సతీష్, ఝాన్సీ లక్ష్మిలతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తులసిబాబు, నూతన కార్యదర్శి వేణుగోపాలస్వామి, కోశాధికారి పోలుకొండ సుబ్రహ్మణ్యం, సంఘమిత్ర కార్యదర్శి గుడివాడ ధనలక్ష్మి, కోశాధికారి కాట్రగడ్డ రజిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సుకు ప్రత్యేక పూజలు : ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలనలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషలతో ఉండాలని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ,శిరిషా దంపతులు గురువారం జానకీరామపురంలో కొలువైవున్న శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు .తొలుత స్థానిక ఆంధ్రాబ్యాంక్ దగ్గరలోఉన్న ప్రముఖ న్యాయవాధి ,మచిలీపట్టణం పార్లమెంట్ లీగల్ సెల్ అడ్వైజర్ అంగర రంగనాథ్ ఇంటి వద్దనుండి రంగనాథ్ దంపతులతో కలసి కాగిత కృష్ణప్రసాద్ దంపతులు అభిషేక పానీయాలతో ,దేవునికి సమర్పించే పట్టు వస్త్రాలతో భారీ ఊరేగింపుగా దాదాపు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీ శిరిడి సాయబాబా దేవాలయం వరకు సంప్రదాయ మేళతాళాలతో పాదయాత్ర నిర్వహించారు .దేవాలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలో శిరిడి సాయినాధునికి అభిషేకాలను ఇరువురి దంపతులు నిర్వహించారు . ఈ సందర్భంగా ఎం ఎల్ ఎ కాగిత కృష్ణప్రసాద్ మాట్లడుతూ ఆంధ్రరాష్ట్రం గత పాలకుల మూర్ఖత్వంలో రాష్ట్రంలోని అన్ని రంగాల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు .భగవంతుడు రాక్షస పాలనను అంతమొందించి ,నిరంతరం ప్రజాపాలనలో నిమగ్నమై రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కృషిచేసే నారా చంద్రబాబునాయుడికి పట్టంకట్టారన్నారు .ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలనలో రాష్ట్రంలో ఉన్న అన్ని రంగాల ప్రజలు సుభీక్షంగా ఉండాలని కోరుకుంటూ ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని వివరించారు .అనంతరం దేవలయం వద్ద భారీ అన్నసమరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమంలో టిడిపి సినియర్ నాయకులు ఇల్లూరి లీలాకృష్ణ ,బొర్ర కాశీ ,పెందురు కొండ ,జొన్నలగడ్డ కొండలరావు ,సన్నల ప్రసాద్ ,ఓబిలిశెట్టి నాని ,జక్రయ్య ,మండలంలోని టిడిపి నాయకులు ,కార్యకర్తలు ,అబిమానులు ,మహిళలు భారీగా పాల్గొన్నారు ....

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘ సభ్యుల నమోదు కార్యక్రమం బుధవారం, గురువారం మండలంలో విస్తృతంగా నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులు ప్రతి పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను సభ్యులుగా చేర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను తీర్చేందుకు ఉద్యమాలు చేయవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి యుటిఎఫ్ సంఘం బలోపేతం ఎంతో అవసరమని వివరించారు. యుటిఎఫ్ సంఘానికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొర్రా వీరస్వామి, సీనియర్ ఉపాధ్యాయులు కొప్పినేని సూర్య ప్రకాష్ రావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రగతి పదం

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రగతి పదం లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా గురువారం అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రు నాలుగు రోడ్లకూడలిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుండి వినతలు స్వీకరించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన ప్రజా దర్బార్ స్ఫూర్తితో ప్రగతి పదం రూపొందించామని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రగతి పదం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించడానికి ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఆ విధానంలోనే డయేరియా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరుపల్లి గణేష్, మచిలీపట్నం పార్లమెంటు ఆర్గనైజింగ్ కార్యదర్శి చాట్ల రమేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో డ్రైనేజిలను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-పెడన : పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు సూచనల మేరకు పెడన పట్టణంలో 18,19,20,21,22 వార్డులకు చెందిన డ్రైనేజ్ కొద్దిపాటి కురిసిన వర్షాలకు అరవ పేట, గాంధీనగర్, రామలక్ష్మి వీవర్స్ కాలనీలుగత కొన్ని సంవత్సరాలుగా ముంపునకు గురవుతుండడంతో అక్కడి ప్రజల విజ్ఞప్తి మేరకు గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యగారు పరిశీలించారు. 19వ వార్డు రామాలయం వెనుక నిర్మించిన డ్రైనేజ్ రోడ్డుపైనే నిర్మించడంతో ప్రజలకు ఎటువంటి ఉపయోగం కలక్కుండా డ్రైనేజీ నిర్మించారని ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో కమిషనర్ పరిశీలించి వెంటనే 24 గంటల లోపు రిపోర్ట్ ఇవ్వాలని మున్సిపల్ ఏ ఈ ని కమిషనర్ ఆదేశించారు.

రైతుబజార్లో చౌక ధరల దుకాణం ప్రారంభం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక రైతు బజారులో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నూతన ఏర్పాటు చేసిన సబ్సిడీ ధరలకే నాణ్యమైన బియ్యం, కందిపప్పు విక్రయ స్టాల్‌ను గురువారం ఆర్డీఓ పి.పద్మావతి, కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పద్మావతి, టిడిపి జనసేన పార్టీల నాయకులు కందిపప్పు ప్యాకెట్లు, బియ్యం బస్తాలను కొనుగోలుదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి,ఎమ్మార్వో ఆంజనేయులు, సివిల్ సప్లై డీ.టీ రంగారావు, ఎలక్షన్ డి.టీ లోకరాజు, రైతు బజార్ ఈవో శ్రీకాంత్, పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే వెంకట్రావు

విశాలాంధ్ర-గన్నవరం : రాష్ట్ర అభివృద్ధి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నిత్యాసర సరుకుల ధరలను నియంత్రిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కంది పప్పు, బియ్యం అందించేందుకు కౌంటర్‌ను గురువారం గన్నవరం రైతు బజార్లో ఆయన ప్రారంభించి ప్రజలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిత్యావసరధరలు అదుపులో ఉండేవని,గత ప్రభుత్వ హయాంలో అన్ని ధరలతో పాటు నిత్యావసర ధరలు కూడా ఆకాశాన్నంటాయన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు జాస్తి వెంకటేశ్వరవు, జూపల్లి సురేష్, మాజీ సర్పంచి గుడపాటి తులసి మోహన్ జాస్తి సుధీర్, పొలడుగు నాని, చలమలశెట్టి రమేష్ బాబు, కోటగిరి వరప్రసాద్, దయాల రాజేశ్వరరావు, , పొట్లూరి ప్రసాద్, మద్దినేని వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ అరుణ కుమారి దేవినేని సులోచన పడమట రంగారావు అధికారులు యం ఆర్ ఓ ఎన్ ఎస్ పవన్ కుమార్, పాల్గొన్నారు.

కూచిపూడి రైతు బజార్లో బియ్యం విక్రయాలు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచి పూడి రైతు బజార్లో గురువారం నుంచి సరసమైన ధరలలో నాణ్యమైన సరు కులు అమ్మకాన్ని ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో ప్రారంభించారు. కంది పప్పు, బియ్యం అమ్మకాలను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావుకృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర ప్రారంభించారు. బహిరంగ మార్కెట్లో అధికమైన ధరలతో అమ్ముతున్న నాణ్యమైనబియ్యాన్ని, కందిపప్పును సామాన్యులకు అందుబాటులో ఉండే ధరలతో అమ్మకాలు చేస్తున్నాయని, కూచిపూడి రైతు బజార్లో ఏర్పాటు చేసిన ఈ దుకాణంలో కూచిపూడి-పెదపూడి కిరాణా మర్చంట్స్ సహకారంతో అమ్మకాలు ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి దంపతులు, తాసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి, సివిల్ సప్లై స్. డీ.టీ నాగిశెట్టి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్.భవాని, వీఆర్వో ఎం కాశీం, రైతు బజార్ ఈవో లంకే బలి చక్రవర్తి, సూపర్‌వైజర్స్ పడవల నరేష్, నందేటిశివ సాయి, మండల తెలుగుదేశం కార్యదర్శి వీరంకి తులసీదాస్, టీడీపీ నాయకులు తాతినేని పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు, వెంపటి గోపాలకృష్ణ, తాతా ప్రభాకర్ రావు, భోగాది నాగేశ్వరరావు, ఓరుగంటి నాగరాజు, నిర్వాహకులు, పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి ప్రాణ రక్షణ పొందండి

విశాలాంధ్ర- నందిగామ : నందిగామ పట్టణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నుంద్రు విద్యాసాగర్ అధ్యక్ష తన పట్టణంలోని కమ్మ కళ్యాణమండ పం నందు హెల్మెట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా నందిగామ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రియాజ్, పట్టణ సిఐ హనీష్ పాల్గొన్నారు. సివిల్ జడ్జ్ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ను ఉపయో గించాలని, విధిగా 18 సంవత్సరాలు దాటిన వారు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, బండికి సంబంధించిన సి బుక్ ఇన్సూరెన్స్ ఉండాలని సూచనలు చేశారు. పట్టణ సీఐ హనీష్ మాట్లాడు తూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు కనీస అవగాహన ఉండాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నుండి ప్రాణాన్ని రక్షించు కొనుటకు హెల్మెట్ ఏవిధంగా ఉపయోగ పడుతుందో వాహనదారులకు వివరించారు.హెల్మెట్ ధరించండి ప్రమాదాల సమయంలో ప్రాణ రక్షణ పొందండి మీ పై ఆధారపడ్డ మీ కుటుంబానికి అండగా నిలవండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నందిగామ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రియాజ్, సీఐ హనీష్, బార్ అధ్యక్షులు విద్యాసాగర్, ఎస్సై పండు దొర,ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ సుందర్, సుధీర్ న్యాయవాది ఎక్కిరాల, రవికుమార్ ,కొమ్మినేని మల్లేశ్వరరావు,సీనియర్ విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.